- అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రూ.4,500 కోట్లు కేటాయింపు.. ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి
- తల్లికి వందనం పథకం నిధుల కేటాయింపునకు ఓకే.. ఒకటి నుంచి ఇంటర్ వరకు జిల్లాలో 16.51 లక్షల మంది తల్లులకు ప్రయోజనం. లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున జిల్లా అంతటికి రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సైతం త్వరలో అమలు చేస్తామని ప్రకటన.. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో 19 లక్షల మంది వరకు ప్రయోజనం



సూపర్.. బడ్జెట్

కూటమి 'పద్దు' పాడుపు





కాకినాడ/రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పయ్యావుల పద్దు సంక్షేమ మంత్రం జపించింది.బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట వేస్తూ ముందుకు కదిలింది. మహిళలు, అన్నదాతల మేలే అసలు సిసలు ప్రాధాన్యంగా భావించి వరాల జల్లు కురిపించింది. ఎప్పుడెప్పుడా అని సూపర్‌సిక్స్ హామీల అమలుకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులకు తీపికబురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం అలవిమాలిన అప్పులతో ఖజానాను గుల్ల చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించినా.. ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడుతూ ఇచ్చిన హామీల అమలుకు నిధుల విదిలింపుతో తమది చేతల ప్రభుత్వమని విత్తమంత్రి చూపించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళల ఉచితబస్సు ప్రయాణానికి త్వరలో శ్రీకారం చుడుతున్నామని ప్రకటించి పేద, మధ్య తరగతి వర్గాలను ఉత్సాహపరిచారు. వ్యవసాయానికి తూట్లు పొడిచి అన్న దాతల సిరిని అటకెక్కించిన గత వైసీపీ ప్రభుత్వ పాతకానికి చరమగీతం పాడుతూ తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి బడ్జెట్‌లో ఊపిరిపోశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి రాష్ట్రబడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వికసించింది. బడ్జెట్ ప్రకటన మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క అన్నదాత సుఖీభవ పథకం అమలుకే రాష్ట్రప్రభుత్వం 4.54 లక్షల మంది రైతులకు రూ.908 కోట్ల లబ్ధి జరగనుంది.

అన్నదాతలకు ఆనందం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం ధగాతో మోసపోయిన అన్నదాతలను ఆదుకుంటామని ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.4,500 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. సున్నా వడ్డీ రుణాలకు బడ్జెట్‌లో రూ.628 కోట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 3.01 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇందులో ఒక్క కాకినాడ జిల్లాలో 96,383మంది అన్నదాతలకు మేలు జరగనుంది. వీరంతా రూ.22 కోట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. అన్నదాతలకు అండగా నిలబడేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమలు చేసింది. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా రైతులకు బోర్లు కొట్టించింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి ఊపిరిపోసింది. రూ.50 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. దీంతో తిరిగి అన్నదాతలకు మంచి రోజులు వచ్చినట్లయింది.

తల్లికి వందనమే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల ప్రకటించారు.దీంతో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్నికలకు ముందు టీడీపీ ఈ పథకాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రాధాన్యం కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం.ఇందులో ఒక్క కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం కలగనుంది. ఒక్క కాకినాడ జిల్లాకు చూస్తే ఆర్థిక భారం రూ.930కోట్ల వరకు ఉంది.

ప్రకృతి సాగుకు పండగే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ప్రకృతిసాగు విస్తీర్ణం పెరుగుతోంది.ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.422 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విధానం కింద సాగుచేసే రైతులకు ఆర్థిక సహకారం అందనుంది. ఉమ్మడి జిల్లాలో వరి, ఇతర వాణిజ్య పంటలు దాదాపు పదివేల ఎకరాల్లో ప్రకృతి సాగు కింద ఉన్నాయి. కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీనికి మరింత కట్టుబడి ఉంటామని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రక టించింది. దీంతో స్మార్ట్‌సిటీకి మరింత ఆర్థిక దన్ను లభించనుంది. రూ.50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్ర ణాళికల రూప కల్పన చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మండపేట, రామచంద్రపురం,పిఠాపురం తది తర పట్టణాలకు మహర్దశ పట్ట నుంది.ఈ ప్రణాళికతో పట్టణాల్లో ప్రజల జీవన విధానం, భవిష్యత్తులో పెరగబోయే ట్రాఫిక్‌కు పరిష్కారం, భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికలతో మరింత మెరుగుపడనున్నాయి.

- రాష్ట్ర బడ్జెట్‌లో వరాల జల్లు
- సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి
- సూపర్‌సిక్స్ హామీలకు పెద్దపీట
- మళ్లీ ఎన్టీఆర్ జలసిరి
- నగరాల అభివృద్ధికి చర్యలు
- 'తూర్పులో ప్రత్యేక బెటాలియన్
- చింతలపూడికి ప్రాధాన్యం
- రహదారులు మార్చికి రెడీ

ఇక రైట్‌రైట్..

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్ కొట్టే ఛార్జీలు వసూలు చేసింది.బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ నేపథ్యంలో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా మంత్రి పయ్యావుల ప్రకటించారు.ఈ పథకంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25.52 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కిందకు రానున్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలో 9.50లక్షల మం దికి ప్రయోజనం జరగనుంది.

రహదారుల నిర్మాణం

రాజమహేంద్రవరంలో మరో ప్రత్యేక పోలీసు బెటాలియన్‌ను ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పరిధిలోని గోదావరిలో నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత కల్పించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలకు ఇళ్ల నిర్మాణానికి ప్రధాని ఆవాజ్ యోజన పథకం కింద రూ.లక్షా 30 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.50వేలు ఇవ్వనుంది. దీంతో పేద, మధ్య తరగతి బీసీలకే సొంతిల్లు కట్టుకోవడానికి వెసులుబాటు దొరికినట్టు అయింది. మిగతా జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా తక్కువగా ఉంది.జిల్లాలో రహదారి పనులన్నీ 2025 మార్చినాటికి పూర్తి చేయనుంది.బీసీ సబ్ ప్లాన్‌కు ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయనుంది. బీసీల స్వయం ఉపాధికి ప్రత్యేక పథకాలు తీసు కుని రానున్నట్టు ప్రకటించారు.అభివృద్ధిపరంగా రోడ్లు, డ్రెయిన్లు,భవనాలు నిర్మించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన రోడ్లన్నీ వచ్చే మార్చిలోపు నిర్మించడానికి నిధులు కేటాయించారు. జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలన్నింటికీ డబుల్ లేన్ రోడ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గోదావరి జిల్లాలకు అన్నం పెట్టే ఇరిగేషన్ సిస్టమ్ అభివృద్ధికి భారీగానే నిధులు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. తాము డెల్టా కాలువల అభివృద్ధితో పాటు గోదావరి ఏటిగట్లు, పొలాలు కోతలకు గురికాకుండా గ్రోయిన్ల నిర్మాణ ప్రతిపాదనలు పంపామని,ఈసారి భారీగా నిధులు కేటాయించనున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో వివరంగా కేటాయింపులొస్తాయన్నారు.

ఇది అభివృద్ధికి తొలిమెట్టు



ఇది నాలుగు నెలల బడ్జెట్. గత ఐదేళ్లలో గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించే బడ్జెట్ ఇది. రాబోయే ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమాలకు ఇది తొలి మెట్టు. ఏపి సమగ్రాభివృద్ధికి తొలి అడుగు. టూరిజం, స్పోర్ట్స్, యూత్ కోసం రూ.328 కోట్లు కేటాయిం చాం.

- కందుల దుర్గేష్, మంత్రి

అభివృద్ధి- సంక్షేమంపై దృష్టి



ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి ఇది అద్భుత బడ్జెట్. అభివృద్ధి- సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయం.. ఇరిగేషన్.. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించింది. సూపర్‌సిక్స్ అమలు వేగవంతం చేసింది.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

అద్భుత బడ్జెట్ ఇది..



తీవ్ర కష్టాలో ఉన్న రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిని పరుగెత్తించే విధంగా బడ్జెట్ ఉంది. ఇది కేవలం భవిష్యత్ దృష్టి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యం. మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది



ఈ బడ్జెట్ ప్రజల్లో నమ్మకాన్ని కలిగించింది. వైసీపీ అనాలోచిత విధానాల వల్ల అప్పుల పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బడ్జెట్ ఇది. సంక్షేమం- అభివృద్ధి రెండింటికి ప్రాధాన్యత ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధులతోపాటు అన్నివర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించింది.

- ఆదిరెడ్డి శ్రీనివాసు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే

రైతు సంక్షేమానికి పెద్దపీట



ఈ బడ్జెట్ ఎక్స్‌లెంట్. రైతు సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి అన్ని విధాలా ఉపయోగపడేది. శిథిలావస్థలో ఉన్న ఎడ్యుకేషన్, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు తేనుంది. అభివృద్ధితోపాటు సంక్షేమం కచ్చితంగా అమలుచేసే బడ్జెట్ ఇది. పేదల సంక్షేమం బడ్జెట్ ఇది.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే

అసమానతలు తగ్గించే బడ్జెట్



ఈ బడ్జెట్ సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించే విధంగా ఉంది. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోయిన సంగతి తెలిసిందే. ఇది అభివృద్ధి- సంక్షేమంతో కూడి ఉంది. రైతులు, కూలీలు, మహిళలు, వివిధ వర్గాల ఎదుగుదలకు ప్రాధాన్యం కలిగించింది.

-మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

ఇది సూపర్ బడ్జెట్



కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఎలా నడిపించాలో సీఎం చంద్రబాబుకు తెలుసు.. అందుకే మార్చి వరకు ఓ పునాదిగా సంక్షేమ అభివృద్ధితో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇది సూపర్ బడ్జెట్.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

-ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే



పీజీఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

24 గంటల్లో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం/రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను 24 గంటల్లో పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీకోసం (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు 144 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూవిభాగానికి 59, పంచాయితీరాజ్ 22, వ్యవసాయ శాఖ 18, పోలీస్ 18, ఇతర శాఖలకు 27 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఎస్పీ నరసింహ కిషోర్ 26 ఫిర్యాదులను స్వీకరించారు.చట్ట పరిధిలో తగు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు పాల్గొన్నారు.



పుష్కరఘాట్ వద్ద భక్తజనం

హర హర మహాదేవ

గోదావరి ఘాట్లకు భక్తులు పోటెత్తారు.. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తజనం పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా తరలివచ్చారు.. గోదావరిలో స్నానం చేసి హర హర మహాదేవ శంభో శంకర అంటూ దీపాలు వదిలారు.. దీంతో రాజమహేంద్రవరం, కొవ్వూరులోని గోదావరి రేవులు భక్తజనంతో నిండిపోయాయి.. శివాలయాలకు క్యూకట్టారు.. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.. ఎక్కడికక్కడ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కడియపులంకలో అనంతేశ్వరుడికి అభిషేకం

ఎమ్మెల్సీ ఎన్నికలకు 20 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ శాసన మండలి ఉప ఎన్నికల షెడ్యూలు సోమవారం విడుదలైందని, ఈ నెల 18వ తేదీలోపుగా నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. తూర్పు గోదావరిలోని 18 మండలాల్లో ఒక్కోటి చొప్పున, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు మొత్తం 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.పురుషులు 1597, మహిళలు 1307 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమలో ఈ నెల 4 నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని గుర్తు చేశారు. నియమావళి పర్యవేక్షణకు 21 బృందాలను నియమించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

ముఖ్య తేదీలు ఇవే : నోటిఫికేషన్ జారీ నవంబరు 11, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ 18, పరిశీలన 19, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 21, పోలింగ్ డిసెంబరు 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ, 9న ఓట్ల లెక్కింపు,12న ఎన్నికల కోడ్ ముగింపు.

14 నుంచి ఇంటింటా కేన్సర్ స్క్రీనింగ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 14 నుంచి ఇంటి వద్దనే ఉచితంగా కేన్సర్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు షుగర్, బీపీ, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌కు సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో టి.శ్రీరామచంద్రమూర్తి,డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర, ఎపిడమాలజిస్ట్ సుధీర్, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ హెల్త్‌కార్డులు

చైల్డ్ స్క్రీనింగ్‌కు సంబంధించి హెల్త్‌కార్డును కలెక్టర్ ప్రారంభించారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ హెల్త్‌కార్డులను అందజేయడం జరుగుతుందన్నార.వైద్య సిబ్బంది ద్వారా ఆ కార్డులో సంబంధిత పిల్లవాడికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారాన్ని నింపడం జరుగుతుందని తెలిపారు. నవంబరు 12 నుంచి 28వ తేదీ వరకూ సాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

స్వామియే.. శరణం అయ్యప్ప



కోటనందూరు మండలం బొద్దవరంలో అయ్యప్ప లక్ష పత్రి పూజ చేస్తున్న స్వాములు(ఫైల్)

- స్వామి మాలధారణ నియమ, నిబ్ధతతో ఆధ్యాత్మిక చింతన.. ఆరోగ్యానికి రక్షణ
- 41 రోజులపాటు కఠిన దీక్ష
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షమంది స్వాములు
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్న గ్రామాలు

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వామిశరణం.. అయ్యప్పశరణం అంటూ స్వాముల శరణుఘోషతో గ్రామాలు మార్మోగుతున్నాయి. స్వాముల మాలధారణతో ఆధ్యాత్మిక చింతన భావం పెరుగుతుంది. స్వామి దీక్ష మంచి ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తోంది. ఏటా అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో స్వాములు మాలధారణ చేస్తుంటారు. కార్తీకమాసం, ధనుర్మాసం రెండు నెలల్లో మండలి దీక్ష, మకర జ్యోతి దర్శనానికి వెళ్లే భక్తులతో శబరిమల కిటకిటలాడుతుంది. ఈ ఏడాది అధికసంఖ్యలో స్వాములు మాలధారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఒక లక్షమంది స్వామి మాలధారణ చేపట్టారని గురుస్వాములు అంటున్నారు. గతేడాది కంటే ఈఏడాది గ్రామాల్లో సంఖ్య మరింత పెరిగిందని తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు

స్వామి మాలధారణ 41రోజులపాటు నియమనిష్టలతో ఆచరించే స్వాములు శారీరకంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. ఎంతో సద్బుద్ధి కలిగి ఉంటారు. సత్ప్రవర్తన మంచి ఆలోచనకు తోడ్పాటునిస్తుంది. శాకాహారం తీసుకోవడం, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ ఒక చోట ఉండి పూజలు చేస్తుంటారు. మాలధారణ చేసిన భక్తులు 41రోజులపాటు కఠోర దీక్ష చేస్తారు. అనంతరం గురుస్వాముల ద్వారా ఇరుముడిని కట్టి కేరళ రాష్ట్రంలో శబరిమలకు వెళ్లి ఇరుముడిని అయ్యప్పకు ఇస్తారు. అక్కడకు వెళ్లలేని స్వాములు ద్వారపూడిలో అందజేస్తారు. అయ్యప్పమాలధారణతో ఆధ్యాత్మిక నెలకొల్పేలా చేస్తున్నారు.

మాలధారణతో ప్రయోజనాలెన్నో..

- ఉదయం, సాయంత్రం చల్లని నీటితో స్నానం చేయడంవల్ల శరీరంలో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. శిర స్నానంతో రక్తపోటు తగ్గి మంచి ఆరోగ్యం చేకూరుతుంది.
- శీతాకాలం స్వాములు నల్లటి వస్త్రాలను ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో ఇవి శరీరానికి ఉపకరిస్తాయి. స్వాములు శని ప్రభావానికి లోనుకాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని గురుస్వాములు అంటున్నారు.
- నుదుటన చందనం, విభూది, కుంకుమ పెట్టడంవల్ల చల్లదనంతోపాటు, మానసిక ప్రశాంతత కల్గుతుంది. కాళ్లకు చెప్పులు లేకపోవడంవల్ల నడిచేటప్పుడు చిన్నచిన్న రాళ్ల గువ్వలు తగిలి రక్తప్రసరణ బాగా అవుతుంది.
- శాకాహారంతో ఆరోగ్యకరంగా ఉండడంతోపాటు మంచి దినచర్య అలవడుతుంది.

ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది



స్వామి మాలధారణతో భక్తిభావం పెరిగి గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. స్వామి మాలధారణతో మంచి ఆరోగ్యంతోపాటు ప్రశాంతత ఉంటుంది.

-సిద్దా నానాజీ, గురుస్వామి, గొల్లప్రోలు

చెడు అలవాట్లకు దూరంగా...



స్వాములు మాలధారణవల్ల చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరంగా మారి క్రమశక్షణగా ఉంటారు.

-అర్లి శ్రీనివాస్, గురుస్వామి, కాకరాపల్లి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నోటిఫికేషన్ విడుదల


కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవాలన్నారు. డిసెంబరు 5న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

తొలిరోజు నామినేషన్ నిల్

తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఊపిరిని పట్టే.. న్యుమోనియా!

మేలుకోకుంటే.. ప్రమాదమే!



- అప్రమత్తతోనే దూరం
- ఇది కొవిడ్ లాంటిదే..
- ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్
- నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం
- రోగనిరోధకశక్తి తక్కువైతే వ్యాప్తి
- కఫం, దగ్గు, ఆయాసం లక్షణాలు
- కొవిడ్ జాగ్రత్తలే మేలు
- నేడు ప్రపంచ న్యుమోనియా డే

జీజీహెచ్(కాకినాడ)/రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : న్యుమోనియా.. ఊపిరితిత్తుల్లో వచ్చే ఒక ఇన్‌ఫెక్షన్. దగ్గినప్పుడు, వైరస్‌ల ద్వారాను, బాక్టీరియా ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. తుమ్మినప్పుడు, దగ్గినపుడు ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణ భాషలో న్యుమోనియాను నెమ్ముగా వ్యవహరిస్తుంటారు.ఇది వచ్చిన రోగికి దగ్గు, కఫం, జ్వరం, ఆయాసం వంటివి వస్తుంటాయి. వివిధ రకాలైన పరీక్షల ద్వారా దీన్ని గుర్తించవచ్చు. నాన్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఇది రావొచ్చు. కొన్ని రకాల పడని వస్తువులు తిన్నా, పడని వాతావరణంలోకి వెళ్లినా ఇది వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మంగళవారం ప్రపంచ న్యూమోనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం..



ఈ లక్షణాలుంటే జాగ్రత్త

మనిషి రక్తంలో ఆక్సిజన్ స్థాయి పడిపోతే వెంటిలేటర్ వరకు వెళ్లే స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే కఫం బాగా పడుతున్నా,చలికి బాగా వణుకుతున్నా, బాగా ఆయా సపడుతున్నా, దేహంలో ఎటువంటి తేడాలు కనిపించినా, వెంటనే పల్స్ ఆక్సీమీటర్‌పై పరీక్షించుకుని శాచురేషన్ 85 కంటే తక్కువుగా ఉంటే వెం టనే వైద్యుడిని సంప్రదించాలి. అక్కడ చికిత్స ద్వారా ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

గుర్తించడం ఎలా...

వైరల్ న్యూమోనియా సోకినపుడు ఎక్స్‌రేలో చిన్న చిన్న మచ్చలుగా కనిపిస్తాయి. ఇవి చిన్నగా ఉంటాయి కాబట్టి చాలా మంది సరిగా గుర్తించలేరు. అప్పుడు సీటీ స్కాన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలా కాకుండా పెద్ద మచ్చలా కనిపిస్తే దాన్ని బాక్టీరియల్ న్యుమోనియాగా గుర్తిస్తారు. వైరస్, బాక్టీరియా తేలిన తర్వాత దానికి అనుగుణంగా మెడిసిన్ ఇస్తారు.

చలికాలంలో వైరల్ న్యుమోనియా

చలికాలంలో వైరల్ న్యుమోనియాలు ఎక్కువగా వస్తాయి. సీజన్ ఆరంభం నుంచీ వీటి ప్రభావం కనిపిస్తుంది. బాక్టీరియల్ న్యుమోనియాలు ఎప్పుడైనా రావచ్చు. వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉండేవారికి ఎక్కువగా వస్తాయి. రెండేళ్ల చిన్నారులకు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా స్మోకింగ్ చేసేవారికి, రీనల్ ఫెయిల్యూర్ పేషెంట్, హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులకు స్టెరాయిడ్స్ వాడుతున్నవారికి కూడా రావొచ్చు. వీరితోపాటు కేన్సర్ పేషెంట్లు, ఊపిరితిత్తుల వ్యాధులున్నవారికి, నియంత్రణలేని డయాబెటిస్ రోగులకు న్యుమోనియాలు ఎక్కువగా వస్తుంటాయి.

కొవిడ్ జాగ్రత్తలే...

ఏ రకం నిమోనియాకు అయినా కొవిడ్ జాగ్రత్తలే తీసుకోవాలి. మాస్కు ధరించడం, సోషల్ డిస్టెన్స్ మెయింటైన్ చేయడం, తరచూ చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలి. తుంపర్లు ద్వారా ఇతరులకు త్వరగా వ్యాపించే అవకాశం ఉన్నందున మాస్కు ధరించడం శ్రేయస్కరం అని వైద్యులు చెబుతున్నారు.



కాలుష్యం.. కోనోకార్పస్ చెట్లూ

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో వాహనాల సంఖ్య ఎక్కువ. ఈ నగరాలకు దగ్గర్లో పరిశ్రమలు ఉన్నాయి. వాహనా లతో పాటు ఫ్యాక్టరీల నుంచి వచ్చే వాయు కాలుష్యంతో నిండిన గాలి పీల్చినవారికి న్యుమోనియా సంక్రమించే అవకాశాలున్నాయి. అందు వల్ల వ్యాధినిరోధకశక్తి తక్కువ ఉన్నవారు మాస్కు ధరించడం ఉత్తమం. అలంకారం కోసం, నీడ కోసం రోడ్లకు ఇరువైపులా నాటిన కోనోకార్పస్ చెట్లు పెద్ద నగరాలు, మునిసిపాలిటీల్లో ఎక్కువ. ఈ చెట్ల వల్ల..వాటి పూల పిప్పొడి మనిషి ఊపి రితిత్తుల్లోకి వెళ్లి ఇన్‌ఫెక్షన్ చేరి న్యూమోనియాకు దారితీసే అవకాశాలున్నాయి.కొన్ని కెమికల్స్, రేడియేషన్ వల్ల కూడా న్యుమోనియా రావచ్చు.ఇన్‌ఫెక్షన్ల వల్ల కాకుండా నాన్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వస్తుంటాయి.

ముందే మేల్కొంటే మంచిది..

సకాలంలో చికిత్స చేయించుకుంటే న్యుమోనియా పెద్ద జబ్బేమీ కాదు. కానీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం మరణానికి చేరువై భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. న్యుమోనియా ఊపిరితిత్తుల్లో ఏర్పడుతుంది.ఈ వైరస్ ఒకేసారి చుట్టుముట్టి ఎక్కువ మందిని ప్రభావితం చేసి మరణం వరకు తీసుకెళ్తుంది.ఈ తరహాలో 2000లో బర్డ్‌ఫ్లూ, 2009లో స్వైన్‌ఫ్లూ, 2018లో నిఫా వైరస్, 2020లో కొవిడ్ వచ్చి ప్రాణాంతకంగా మారి ఎంతో మంది మరణానికి కారణమయ్యాయి.ఇవన్నీ వైరల్ న్యు మోనియా జ్వరాలే.ఇవి కాకుండా సాధారణంగా వ్యాప్తి చెందేవి బ్యాక్టీరియల్ న్యుమోనియా జ్వరాలు.ఇవి వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో కనబడతాయి.

సకాలంలో వైద్యమే మందు

సకాలంలో న్యుమోనియాకు వైద్యం చేయించుకోకపోతే లోపల ఉన్న ఇన్‌ఫెక్షన్ వల్ల రసిపట్టడం.. ఛాతీలోకి రసి చేరడం, ఒక్కోసారి క్రిములు దేహమంతా వ్యాపిస్తాయి. న్యుమోనియా బాగా ముదిరితే అది రక్తంలోకి చేరుతుంది. దీన్ని సెప్టిసేమియా అంటారు. రక్తంలో నుంచి శరీర ప్రధాన అవయవాలైన కిడ్నీ, లివర్, గుండె, బ్రెయిన్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో మల్టీ ఆర్గాన్స్ ఫెయిలై కోమా లేదా ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. మల్టీ ఆర్గాన్స్‌కు వెళితే యాంటీ బయాటిక్స్ ఇవ్వడం ద్వారా నయం చేసే అవకాశంఉంది.వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉంటే ఆగస్టులో ఇన్‌ఫ్లు యేంజా వ్యాక్సి న్ లేదా న్యూమోకోకిల్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.

వైద్యులేమంటున్నారంటే..

ముందు జాగ్రత్తతో తరిమేయవచ్చు




ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో వైద్యచికిత్స తీసుకుంటే ప్రాణాంతకమైన న్యూమోనియా జ్వరాన్ని తరిమేయవచ్చు. ఆయాసం అధికంగా ఉన్నా, దగ్గుతో కూడిన కళ్లె పడుతున్నా, ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైనా, పల్స్ ఆక్సీమీ టర్ పరీక్ష చేసుకుని శాచురేషన్ 85 కన్నా తక్కువుగా ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. కాకి నాడ జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు..వెంటిలేటర్ల సదుపాయం ఉంది. - డాక్టర్ సూర్యకుమారి, పల్మనాలజిస్ట్, జీజీహెచ్, కాకినాడ

కొవిడ్ తరహాగానే ఉంటుంది..



అత్యవసరమైతే రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయి. కొవిడ్ కూడా న్యూమోనియానే కానీ అది పాండమిక్ కావడంతో మరణాలు పెరిగాయి. న్యుమోనియాను ప్రాథమిక దశలోనే గుర్తించి యాంటీబయాటిక్స్ ఇవ్వడం ద్వారా రోగి కోలుకుంటాడు. న్యుమోనియాను నయం చేయడంలో యాంటీ బయాటిక్స్ ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

-డాక్టర్ ఎం.కిరణ్, పల్మనాలజిస్ట్ , జీజీహెచ్, రాజమహేంద్రవరం



ఉషోదయాన..

కార్తీకమాసం సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజనంతో నిండుగా ఉంది.. ప్రత్యక్ష దేవుడు సూర్యభగవానుడు.. సోమవారం వేకువజామున మెల్లమెల్లగా బయటకు వస్తూ.. గోదారమ్మలో కాసేపు తన వెలుగును ఇలా ప్రసరింపజేసి భక్తులకు కనువిందు చేశాడు.. గోదారమ్మలో లీనమై ముందు చల్లబడ్డాడు.. ఆ తరువాత మెల్లమెల్లగా ఉదయించాడు.. దీంతో భక్తజనం చల్లంగ చూడుస్వామి అంటూ మొక్కుకున్నారు.. ఈ సుందర దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.. - కొవ్వూరు

శివోహం

కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజమహేంద్రవరంలో భక్తులు పోటెత్తడంతో పుష్కరఘాట్లు కిటకిటలాడాయి. మహిళలు గోదావరిలో కార్తీకదీపాలు విడిచిపెట్టారు. ద్రాక్షారామ, సామర్లకోట తదితర శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



రాజమండ్రి పుష్కరఘాట్, కొవ్వూరులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామివారు



పాదగయ క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన సాహితి

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు సాహితి ఎంపిక

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓరుగంటి సాహితి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు తెలిపారు. ఇటీవల విజయనగరంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపరచడంతో అండర్-15 ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఆమె ఎంపికైనట్టు చెప్పారు. నవంబర్ 21 నుంచి 29 వరకు కటక్‌లో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో సాహితి పాల్గొంటుందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో వడోదరలో జరిగిన రాష్ట్ర జట్టుకు ఎంపికైందని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్నట్టు తెలిపారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17ను పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి మూడోస్థానం సాధించినట్టు తెలిపారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన సాహితిని హెచ్ఎం శ్రీలక్ష్మి, పీఎంపీ చైర్మన్ వేములరాజు, ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్



సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2లక్షల 60వేలు పట్ట భద్రుల ఓట్లు నమోదు చేయించానని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో 3 లక్షల 50 వేల ఓట్ల నమోదు లక్ష్యానికి చేరుకుంటానన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఇచ్చిన అవ కాశాన్ని బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. త్వరితగతిన అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలని అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ పట్ట భద్రుల ఓట్లు నమోదులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, నేతలు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు.

వెయ్యిగుడుల వెలుగు కోసం భక్తి చైతన్యసభ

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వెయ్యి గుడుల వెలుగుకోసం భక్తి చైతన్య ముగింపు సభ అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఎం.ఎం.శ్రీలేఖ తదితరులకు అర్చకులు స్వాగతం పలికారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో వెలుగులు విరజిమ్మేలా ప్రజలను చైతన్యవంతులను చేయడానికే వెయ్యి గుడుల వెలుగు కోసం భక్తి చైతన్య సభ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రా ల్లోని ప్రముఖ దేవాలయాలను వారు సందర్శిస్తున్నారు. సోమవారం వారంతా అయినవిల్లి ఆలయాన్ని, అంబాజీపేట మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. సభలో జొన్నవిత్తుల రచించిన గీతాలను ఆవిష్కరించారు.



అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల, ఎంఎం శ్రీలేఖలకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దృశ్యం


బీసీ హాస్టల్‌లో విచారిస్తున్న బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు

రాజోలు బీసీ హాస్టల్ వార్డెన్ పాండురంగ సస్పెన్షన్

రాజోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ స్పందించారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ హెచ్.పాండురంగను సస్పెండ్ చేశామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి టీవీ ప్రసాదరావు సోమవారం తెలిపారు. బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు విద్యార్థులను హాస్టల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌గా ముక్తేశ్వరానికి చెందిన వార్డెన్ సీహెచ్ సాయిరామ్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు. రాజోలు తహసీల్దారు ప్రసాద్ హాస్టల్‌లోని సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు


హారం సమర్పిస్తున్న దాతలు

సత్యదేవునికి రూ.2.50 లక్షలు విలువైన
ముత్యాలు, పచ్చల హారం సమర్పణ



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి సోమవారం సుమారు రూ.2.50 లక్షల విలువచేసే బంగారంతో చేయించిన 49 గ్రాముల ముత్యాలు, పచ్చల హారాన్ని హైదరాబాద్‌కు చెందిన తుర్లపాటి అనిల్‌కుమార్ అందజేశారు. దాతను ఈవో రామచంద్రమోహన్ అభినందించారు. ఈ హారంలో 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల పెరల్స్ ఉన్నాయని ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు.


దర్శనం అనంతరం సత్యదేవుని సన్నిధిలో సేదతీరుతున్న భక్తులు

రత్నగిరి... భక్త సిరి

కార్తీక సోమవారం సందర్భంగా భక్తజనసంద్రం

ఒక్కరోజు ఆదాయం రూ.80లక్షలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి కార్తీక సోమవారం పర్వదినాన భక్తులు పోటెత్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలను ప్రారంభించారు. సుమారు 70వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.80 లక్షల ఆదాయం లభించింది. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్ రెండు డార్మెటరీల్లో ఉచిత వసతి ఏర్పాటుచేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి భక్తులకు సూచనలిచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం మహిళలు రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. సోమవారం 8,359 జంటలు సత్యదేవుని వ్రతం ఆచరించారు.


రాజమహేంద్రవరంలోని అప్సర థియేటర్లో ప్రేక్షకులను పలకరిస్తున్న వరుణ్‌తేజ్

మట్కా... పక్కా మాస్ మూవీ

రాజమహేంద్రవరంలో హీరో వరుణ్‌తేజ్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మట్కా పక్కా మాస్ మూవీ... మెగా అభిమానులను అలరిస్తుందని మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ అన్నారు. మట్కా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సందడి చేశారు. మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మెగా అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలోకి చేరుకుని ఏవీ అప్పారావు రోడ్డు నుంచి అప్సర థియేటర్ వరకు మెగా ర్యాలీ నిర్వహించారు. వరుణ్‌తేజ్ థియేటర్‌లోకి వచ్చి ప్రేక్షకులతో కలిసి ట్రైలర్‌ను తిలకించారు. మట్కా చిత్రం ఈ నెల 14న విడుదల అవుతుందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు ఏడిద బాబీ, అభిమానులు వానపల్లి ఆంజనేయులు (ఫొటో బాబీ), జానీ, సరదా శ్యామ్ బాబు, రాజ్‌కుమార్, భరద్వాజ్ పాల్గొన్నారు.


కలెక్టర్ ప్రశాంతితో సమావేశమైన యువ కలెక్టర్లు

క్షేత్ర స్థాయి అవగాహనే కీలకం

ఐఏఎస్‌లకు శిక్షణలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ శిక్షణలో క్షేత్రస్థాయి అవగాహన అత్యంత కీలకమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్న అధికారుల బృందం క్షేత్రస్థాయి కేస్ స్టడీ, పరిశోధనలో భాగంగా జిల్లాలో ఏడు రోజుల పాటు పర్యటించారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీజీఆర్ఎస్‌ను పరిశీలించారు. బృందంలో యువ ఐఏఎస్‌లు మన్నన్ సింగ్, అనురాగ్ బబెల్, ప్రియారాణి, షాహీదా బేగం, పార్థ్, కశిష్ భక్షి, స్నేహపన్న, జాదవ్‌రావు, నిరంజన్ మహేంద్రసింగ్, తుషార్ నెగి, అతుల్ మిశ్రా ఉన్నారు.

కార్మికుల కష్టానికి...



'ఈ-శ్రమ' సాయం

అసంఘటిత కార్మికులకు వరం

(శంఖవరం-ఆంధ్రజ్యోతి)

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ-శ్రమ' కార్డులు అందిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 60 లక్షలు జనాభా ఉండగా అందులో 9 లక్షల నుంచి 11లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉంటారని అంచనా. ఇప్పటి వరకు సుమారు 6.11లక్షల మంది కార్మికులు ఇ-శ్రమ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి యూనివర్సల్ ఐడింటిఫికేషన్ నంబర్ (యుఐఎన్) వస్తుంది. ఈ-శ్రమ కింద నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 2లక్షల ప్రమాద బీమా వస్తుందని అదికారులు చెప్తున్నారు. కొన్ని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల వాటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వాటిలో 'ఈ-శ్రమ' కార్డు ఒకటిగా చెప్పుకోవచ్చు. ఈ కార్డు కార్డు పొందడం వల్ల 2లక్షల ప్రమాద బీమాతో పాటు మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం....



ఈ-శ్రమ కార్డ్ అంటే ఏంటంటే:

అసంఘటిత రంగంలో పనులు చేస్తున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కార్డు. భవన నిర్మాణం, చేతివృత్తుల్లో పనిచేసే కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్సు వంటి సౌకర్యాలు ఉండవు. ఏళ్ల తరబడి పనులు చేస్తున్నా గ్రాట్యుటీ అంటేనే వీళ్లకు తెలియదు. అటువంటి శ్రమజీవుల భవిషత్తు భద్రత కోసం, వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ కార్డు పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

ఎలా నమోదు చేసుకోవాలంటే....

ఈ-శ్రమ కార్డు పొందేందుకు ఆన్‌లైన్‌లో Eshram.gov.inలో నమోదు చేసుకోవాలి.

ముందుగా ఆధార్ కార్డుతో లింకైన మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి.

ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాలి.

అనంతరం అడ్రస్, విద్యార్హతలు వంటి వివరాలు పొందుపరచాలి.

అలాగే ఏపనిలో నైపుణ్యం ఉంది, పని స్వభావంతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు ఎంటర్ చెయ్యాలి.

ఇక చివరిగా ధ్రువీకరణ కోసం మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చెయ్యడం ద్వారా ఈజీగా ఈ-శ్రమ కార్డుకు అప్లై చేసుకోవచ్చు.

ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్ ఫింగర్ ప్రింటు, ఐరిస్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో సమీపంలోని కస్టమర్‌కేర్ సెంటర్లో నమోదు చేసుకోవాలి.

ప్రయోజనాలివే

ఈ-శ్రమ కార్డు తీసుకున్న కార్మికులు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై పాక్షిక దివ్యాంగులుగా మారితే కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష చెల్లిస్తుంది.

అదే శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవించినప్పుడు రూ.2 లక్షలు బీమా బాధిత కుటుంబానికి లభిస్తుంది.

ఈ-శ్రమ కార్డు కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా వారి పిల్లలకు ఉచిత సైకిళ్లు, పనిముట్లు, కుట్టుమిషన్లు వంటి ఇతర ఆర్థిక సహాయాలు అందుకునే అవకాశం ఉంది.

వీరంతా ప్రయోజనం పొందవచ్చు...

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, తక్కువ వేతనాలు అనగా... రూ.15వేలులోపు వేతనాలు అందుకుంటున్న ఉద్యోగులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు, రేషనుకార్డుదారులు.... ఇలా 16 నుంచి 59 ఏళ్ళలోపు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.



షాట్‌పుట్‌లో ఫస్ట్

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు మాధవి ఎంపిక



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు అన్నవరం దేవస్థానంలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న మాధవి ఎంపికయ్యారు. ఈ నెల 6న గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరిగిన పోటీలో విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టులో సభ్యురాలు. దీంతో ఈ రెండు క్రీడలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి మరో రెండు నెలల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా మాధవిని దేవస్థానం ఉద్యోగులు అభినందించారు. ఇప్పటికే ఆమె పలు పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. కుటుంబ సభ్యులు, దేవస్థానం ఉద్యోగుల సహకారంతో ఈ విజయాలను సొంతం చేసుకుంటున్నట్టు ఆమె చెప్పారు.


నుజ్జునుజ్జయిన లారీ

సెప్టిక్ ట్యాంక్‌ను ఢీకొన్న లారీ

- ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న సెప్టిక్ ట్యాంక్.. ట్యాంకర్ బోల్తా

దేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి లారీ ఒకదానికి ఒకటి ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం వెళ్తున్న ధాన్యం లారీ దుద్దుకూరు సమీపంలో ఎదురుగా వెళ్తున్న సెప్టిక్ ట్యాంకును బలంగా ఢీకొంది. సెప్టిక్ ట్యాంకు ముందు వెళ్తున్న ఖాళీ ఆయిల్ ట్యాంకును ఢీకొనడంతో ఖాళీ ఆయిల్ ట్యాంకర్ తిరగబడింది. ఈ ఘటనలో ధాన్యం లోడు లారీ డ్రైవర్ రాజు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఖమ్మం జిల్లా భద్రాచలం గ్రామానికి చెందిన వ్యక్తి. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాదగయలో అపచారంపై ఉన్నతాధికారుల సీరియస్

దేవదాయ శాఖ ఉప కమిషనరు విచారణ


రమేష్‌బాబుకు సంఘటనలను వివరిస్తున్న భజరంగదళ్, వీహెచ్‌పీ, హిందూ సంఘాల ప్రతినిధులు

పిఠాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగిన సంఘటనలపై దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు సోమవారం విచారణ చేపట్టారు. పాదగయలోని హోమ గుండాల్లో హోమ ద్రవ్యాలు కాకుండా దర్శనాల టిక్కెట్లు, రశీదు వేసి దగ్ధం చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇటీవల పాదగయ క్షేత్రంలో అఘోరాను దుస్తులు లేకుండా దర్శనానికి అనుమతించడం, అన్యమతస్తుడిని విధుల్లో ఉంచి పూజా ద్రవ్యాలను అతడితో నిర్వర్తించడం తదితర అంశాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో డీసీ విచారణ చేపట్టారు. పాదగయ అధికారులు, సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించారు. హోమగుండంలో రశీదు, టిక్కెట్ పుస్తకాలను ఎవరి ఆదేశాలతో వేశారో ఆరా తీశారు. పాదగయలో జరుగుతున్న వరుస సంఘటనలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగదళ్, హిందూ సంఘాల ప్రతినిధులు డీసీని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీ రమేష్‌బాబు మాట్లాడుతూ పాదగయలో ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్టు తెలిపారు. రికార్డులను పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పవిత్ర కార్తీకమాసంలో ఇటువంటివి జరగడం బాధాకరమని చెప్పారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఉన్నారు.


బీచ్ రోడ్డులో నేమాం సమీపంలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు, ఉప్పాడ తీరంలో అడ్డుగా విరుగుతున్న కెరటాలు

తీరంలో అలజడి

కెరటాల ధాటికి నేమాం సమీపంలో కోతకు గురైన బీచ్ రోడ్డు

కొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా సోమవారం కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్రం కల్లోలంగా మారింది. మధ్యాహ్నం నుంచి తీరం వెంబడి ఈదురుగాలులు బలంగా వీచాయి. కెరటాలు ఉవ్వెత్తున పైకి లేచి బీచ్ రోడ్డును తాకుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి విద్యుత్ ప్లాంటు, కొమరగిరి జగనన్న కాలనీ వరకు బీచ్ రోడ్డుపైకి అలలు దూసుకువస్తున్నాయి. కొమరగిరి పేదల ఇళ్ల కాలనీ-నేమాం మధ్యలో వంతెనకు సముద్ర కెరటాలు పోటెత్తడంతో వంతెన వద్ద అప్రోచ్ సమీపంలో బీచ్ రోడ్డు కోతకు గురైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లతో ఉప్పాడ, నేమాం బీచ్‌లకు విచ్చేసిన పర్యాటకుల భద్రత నిమిత్తం పహారా ఏర్పాటు చేశారు. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఇద్దరు చోరుల అరెస్టు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇళ్ల తాళాలు పగలకొట్టి విలువైన ఆభరణాలను దొంగిలించడంలో అంతర్జాతీయ నేరస్తులుగా పేరొందిన ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సెప్టెంబరు 29న సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గుణ్ణం సాయిబాబు మాస్టారు ఇంటిలో చోరీకి గురైన 186.79 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీకృష్ణభగవాన్, సీసీఎస్ సీఐ అంకబాబు వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదికరకు చెందిన జిల్లెల్ల రాకేష్, తణుకు అర్బన్ కొత్తూరుకు చెందిన చావల కృష్ణ... వేట్లపాలెంలో సాయిబాబు ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. 8 బంగారపు గాజులు, 2 జతల చెవిలీలు, 4 ఉంగరాలు, నల్లపూసలతో కూడిన రెండు చైన్లతో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. సమీప ఇంటిలో సీసీ ఫుటేజీ ద్వారా నమోదైన దృశ్యాలను పోలీసులు సేకరించారు. అందులో లభించిన సమాచారం మేరకు తణుకుకు చెందిన అంతర్జాతీయ దొంగలుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 52 చోరీల్లో కేసులు నమోదైన వీరి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. వారిద్దరినీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వరుస చోరీలకు పాల్పడడం, పట్టుబడడం, జైలుకు వెళ్లడం, తిరిగి బెయిల్‌పై విడుదల కావడం, చోరీలకు పాల్పడడంలో వీరిద్దరూ అంతర్జాతీయ దొంగలుగా పోలీసు రికార్డుల్లో నమోదై ఉన్నారన్నారు. బంగారు ఆభరణాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం 5వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ శ్రీకృష్ణభగవాన్ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, చోరీ జరిగిన తీరును వివరిస్తున్న సీఐ శ్రీకృష్ణ భగవాన్

యువత క్రీడల్లో రాణించాలి

» 'నన్నయ' వీసీ శ్రీనివాసరావు » అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని యువత క్రీడల్లో రాణించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్శిటీలో అంతర్ కళాశాలల పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం జరిగాయి. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈ పోటీల్లో పురుషుల విభాగంలో కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాల, మహిళల విభాగంలో కాకినాడలోని అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాల ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నాయన్నారు. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే దక్షిణ భారత వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాకళాశాల ప్రిన్సిపాల్, కార్యనిర్వాహక ఛైర్మన్ కొండ్రు సుబ్బారావు, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ సంఘ ఉపాధ్యక్షులు బడేటి వెంకటరామయ్య, భాస్కరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీవీఎస్ మూర్తి, కళాశాల పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ముగ్గురి ఎంపిక


పి.శిరీష, ఆర్.లావణ్యజ్యోతి, ఐ.బిందుశ్రీ

బిక్కవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛైర్మన్ ముప్పన వీర్రాజు సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఎంపికైన వారిలో బిక్కవోలుకు చెందిన పారుపల్లి శిరీష, రెడ్డి లావణ్య జ్యోతి, తాళ్లరేవు మండలం నీలపల్లికి చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ ఉన్నారన్నారు. వీరు ఈనెల 8నుంచి 10వరకూ కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా జట్టును ప్రథమ స్థానంలో ఉంచడంతో వీరిని ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ ముగ్గురూ వచ్చే నెలలో ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థినులను వీరితో పాటు ఆడిన జట్టులోని మహిళలను బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శులు ముప్పన వీరభద్రస్వామి, వి.సీతాపతిరావు, బిక్కవోలు అధ్యక్షుడు శశిభూషణం, పీడీ వీకేఆర్. తంబి, పీఈటీలు చైతన్య రెడ్డి, నరేంద్ర, మోహనరావు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


అర్జీలు స్వీకరిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

రాజానగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని రాధేయపాలెంలో సోమవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి ఆమె విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజల్ని మోసం చేసిందని, ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ పేరుతో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

సింగరేణి కేలరీస్ డీజీఎం ప్రసాద్

దివాన్‌చెరువు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదవాలని సింగరేణి కేలరీస్ డీజీఎం జీవీఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పుణ్యక్షేత్రం హైస్కూల్లోని పదో తరగతి, ఇంటర్మీయట్ విద్యార్థులకు బొమ్మూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్స్ అండ్ ఆఫ్ లిజనింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. రీడింగ్, రైటింగ్, టీచింగ్, లిజనింగ్ రాయడంలో జాతీయ ప్రమాణాలు ఉంటాయని, ప్రాక్టీస్ చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమేష్‌బాబు, బోనురాము, ప్రధానోపాధ్యాయుడు ఎస్.తాతారావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అర్జునుడు, రవిశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

నలుగురిపై కేసు నమోదు

గోకవరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ యువకుడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గోకవరం గ్రామానికి చెందిన షేక్ ఖన్నా నజీర్ ఈనెల 10వ తేదీ రాత్రి కృష్ణునిపాలెం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో జరుపుకున్న స్నేహితుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నాడు. వేడుకల అనంతరం ఖన్నానజీర్ ఆరుబయట దీపావళి సామగ్రి వెలిగిస్తున్నాడు. అదే సమయంలో రాజమహేంద్రవరంలో రోజూవారి పనులు ముగించుకొని గోకవరం చేరుకున్న ఓ వివాహిత ఆ మార్గం గుండా సంజీవయ్‌నగర్ వైపునకు నడుచుకుంటూ వెళ్తుంది. ఒంటరిగా వెళ్తున్న ఆమెను నజీర్ వెంబడించి బలవంతంగా సమీపంలో మూతబడి ఉన్న పెట్రోల్ బంకులోకి లాక్కొని వెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని రక్షించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న నజీర్ స్నేహితులకు, స్థానికుల మధ్య వివాదం జరిగింది. పోలీసులకు సమాచారం అందడంతో కొద్ది సేపటికి సంఘటనా ప్రాంతానికి చేరుకొని నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నజీర్‌తో పాటు, స్థానికులతో వివాదానికి దిగిన మరో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారు

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11,(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఏర్పడి 160 రోజులు దాటిందని కాని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రోడ్లు బాగోలేదని చెప్పారు. మరి ఇప్పుడు ఎందుకు రోడ్లు వేయడం లేదన్నారు. రాజమహేంద్రవరం-కాకినాడ ఏడీబీ రోడ్డు పరిస్థితి ఎంతో దారుణంగా ఉందని ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టాదా అని నిలదీశారు. నిరుద్యోగ భృతిలేదు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కకు పెట్టేశారని, కౌన్సిల్‌లో ప్రభుత్వాన్ని నిలదీసే వారిని ఎమ్మెల్సీలుగా గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో జీవీ సుందర్ పాల్గొన్నారు.

కాలువల్లో పైపులైన్లను బయటకు మార్చండి

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11,(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో డ్రైన్‌లలో ఉన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే బయటకు తీయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం నగరంలో 14వ డివిజన్ స్టేడియం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, శ్యామల థియేటర్ నుంచి ఆల్‌కట్ గార్డెన్స్ వరకు డ్రైనేజీలోల ఉన్న పైప్‌లైన్లను కమిషనర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన వార్డు పర్యటనలో 60 ప్రాంతాల్లో డ్రైన్‌లలో తాగునీటి పైప్‌లైన్లు ఉన్నట్టు గుర్తించామని వాటిని తొలగింపు పనులు చేపట్టామన్నారు. ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయని వాటిని కూడా త్వరగా బయటకు మారుస్తున్నారని చెప్పారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించి శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఈ పరిశీలనలో ట్రైనీ ఐఏఎస్‌లు ఉన్నారు.

నటుడు పోసానిపై ఎస్పీకి జనసేన నాయకుల ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11(ఆంధ్ర జ్యోతి): నటుడు పోసాని మురళీకృష్ణను తక్షణమే అరెస్టు చేయాలని జనసేన నాయకులు జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయానికి జనసేన రాజమహేంద్రవరం అధ్యక్షుడు వై.శ్రీనివాస్, లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ రామచంద్ర ఎస్పీని కలిసి రిప్రజెంటేషన్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో పోసానిపై ఫిర్యాదు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసానిపై గతంలో ఫిర్యాదు చేశామని, కోర్టు ఆదేశాలిచ్చినా పోలీసులు నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు.

ఐఏఎస్ శిక్షణలో క్షేత్రస్థాయి అవగాహన కీలకం: కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ శిక్షణలో క్షేత్రస్థాయి అవగాహన అత్యంత కీలకమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్న అధికారుల బృందం క్షేత్రస్థాయి కేస్‌స్టడీ, పరిశోధన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఏడు రోజుల పాటు పర్యటించారు. కలెక్టరేట్‌కు సోమవారం వచ్చి కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికను పరిశీలించారు. బృందంలో యువ ఐఏఎస్‌లు మన్నన్ సింగ్, అనురాగ్‌బబెల్, ప్రియా రాణి, షాహీదాబేగం, పార్థ్, కశిష్ భక్షి, స్నేహ పన్న, జాదవ్‌రావు, నిరంజన్ మహేంద్రసింగ్, తుషార్ నెగి, అతుల్ మిశ్రా ఉన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఉచిత ఇసుక దోపిడీని అరికట్టాలి

» కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా


జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీతో ప్రజలకు మేలు జరగడంలేదని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఇసుక పాలసీ అధికార పార్టీ నేతలకే అనుకూలంగా మారిందన్నారు. ఇసుక అక్రమాలకు పాల్పడుతున్న దళారీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలకు ఇసుక దొరకడం లేదని, యూనిట్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ అమ్ముకుంటున్నారని ఆరోపించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వందేళ్ల భాను ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక నిల్వ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని, ఇసుకను భద్రత యూనియన్లకు అప్పగించాలని కోరారు. ముందుగా కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇసుక్పై అధిక ధరలను నియంత్రించాలని, సంక్షేమ బోర్డు మళ్లీ ప్రారంభించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, జిల్లా కార్యదర్శి మహేష్‌బాబు, అచ్చయ్యనాయుడు, శ్యామల, రామకృష్ణ, కొండలరావు, సాయిబాబా, ఇతర కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

ఉండ్రాజవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలివెన్నులో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి 16వ వార్షికోత్సవం మహోత్సవాలు సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. అనంతరం వనసమారాధన జరిపారు. స్థానిక భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ డే

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సీహెచ్ చంద్రశేఖర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత బి.నాగేశ్వరిని పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు భవానీ, మురళీకృష్ణ, సుభాషిణి దేవి, పవన్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ యూసఫ్ భాషా, కె.అనుషా, ఇతర అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థుల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్శిటీ నిర్వహించిన ప్రి రిపబ్లిక్ డే పరేడ్‌కు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఫైనలియర్ జేఎంసీపీపీఎస్‌వై విద్యార్థి ఎస్.అజయ్‌నాయుడు, బీఎస్సీ మేథ్స్ విద్యార్థిని నవ్య ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి వీరిద్దరినీ ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ పీవో బి.మల్లికార్జున, మురళీకృష్ణ, భవానీ, కె.సుభాషిణి అభినందించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

76 మద్యం సీసాలు స్వాధీనం

అనపర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహేంద్రవాడలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు రంగంపేట ఎక్సైజ్ సీఐ సుధ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి మహేంద్రవాడలో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో మద్యం విక్రయిస్తున్న సత్తి వెంకటరెడ్డిని అరెస్టు చేసి అతడి నుంచి 76 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్వాహకుడితోబాటు అతనికి సరుకు అందించిన షాపుపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎక్సైజ్ సిబ్బంది వై.దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

బుర్రిలంకలో వనసమారాధన

కడియం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బుర్రిలంక ఈశ్వరఫామ్ నర్సరీలో సోమవారం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ఈశ్వరఫామ్ నర్సరీ అధినేత, టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ తాడాల చక్రవర్తి-రాజరాజేశ్వరి దంపతులు వారి కుటుంబసభ్యులు ముందుగా ఉసిరిచెట్టు వద్ద పూజలు చేవారు. వచ్చిన అతిథులకు అరటి ఆకులో తెలుగు వంటకాలతో భోజనం ఏర్పాటు చేశారు.

మండల అధికారులకు రేపు ఒకరోజు శిక్షణ

రాజానగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ శాఖల అధికారులకు ఈ నెల 13న ఒక రోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జీపీడీపీ, బీపీడీసీ, డీపీడీసీ కార్యక్రమంపై ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఉపాధి హామీ, పశుసంవర్థకశాఖ అధికారులు, పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయాధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

కడియం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత మొదటి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవల మరువలేనివని ఎంఈవో ఎంఎస్ మణికుమార్ తెలిపారు. వేమగిరితోట-1 పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి జరిగింది. హిందుస్తానీతో పాటు పార్సీ, బెంగాల్, ఇంగ్లీషులో ప్రావీణ్యం పొందిన ఆజాద్ మొదటి విద్యాశాఖా మంత్రి కావడం ప్రతిభకు పురస్కారంగా భావించవచ్చని ఎంఈవో2- వై.నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: వెలగపూడి అసెంబ్లీ ఆవరణంలో మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ విద్యారంగంలో ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సముపార్జన, దేశ నిర్మాణంలో ఆజాద్ సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే వాసు అన్నారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి టి.శ్రీరామచంద్రమూర్తి నివాళులర్పించారు. 1948నుంచి 1958వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఆయన విశేషమైన సేవలందించారని గుర్తుచేసారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్‌కుమార్, ప్రతినిధులు ఎస్‌కె అసదుల్లా అహ్మద్, ఎస్‌కే కవీన్, ఎండీ అబుల్ రజ్జాఖ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం

నల్లజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పోతవరం-కవులూరు గ్రామాల మధ్య ఉన్న ఉమారామాలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. బుధవారం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 25 వరకు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

హర హర మహాదేవ

» శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
» దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
» పలుచోట్ల కార్తీక దీపోత్సవాలు

దివాన్‌చెరువు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో వివిధ గ్రామాల్లో శివాలయాలు ఓం నమఃశివాయ మంత్రంతో మార్మోగాయి. దివాన్‌చెరువులోని ఆగమాశ్రమంలోని విశ్వేశ్వరస్వామి ఆలయం, పాత తుంగపాడు, సంపత్‌నగరం తదితర గ్రామాల్లో శివాలయాలను వేకువఝాము నుంచే భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించారు. దీపదానం చేశారు. పాలచర్లలో కొందరు భక్తులు బోనాలు పోసుకుని ఊరేగింపుగా కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చి అక్కడి జమ్మిచెట్టువద్ద బోనాలు సమర్పించారు.

కడియపులంకలో లక్ష దీపోత్సవం

కడియం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కడియపులంకలో ఆంజనేయస్వామి జన్మనక్షత్ర పూజలు జరిగాయి. స్వామికి సింధూర, తమలపాకు పూజాది కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మండపంలో పార్వతీ సమేత పరమేశ్వరుని ఉంచి పూజాధికాలు జరిపారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయం వద్ద లక్షదీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు వివిధ ఆకృతుల్లో దీపాలంకరణ చేశారు. భక్తులకు పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం, ఆధ్యాత్మిక గురువు తాడాల వీరవెంకట్రావు, మార్గాని సత్యనారాయణ, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, పంతం కొండలరావు పాల్గొన్నారు.


బిక్కవోలులో లక్ష బిల్వాలతో గోలింగేశ్వరుడు


కడియపులంకలో పరమశివునికి అఖండ హారతి ఇస్తున్న గురుస్వామి

బిక్కవోలులో లక్ష బిల్వార్చన


బిక్కవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయార్చకులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపి లక్ష బిల్వార్చన చేశారు. అలాగే కొంకుదురులోని బుడతలమామిడి వద్ద త్రిముఖ లింగేశ్వరస్వామి, ఊలపల్లిలో అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

వాకర్స్ క్లబ్‌కు అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సేవలకు గాను జవహర్ వాకర్స్ క్లబ్ ఉత్తమ అవార్డును అందుకుంది. ఈ నెల తునిలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ తూర్పుగోదావరి జిల్లాస్థాయి 2024 సంవత్సర సమావేశంలో అవార్డును అందించి సత్కరించారు. ఈ మేరకు సోమవారం జిల్లా వాకర్స్ గవర్నర్,జవహర్ క్లబ్ అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ, సభ్యులకు అభినందనలు తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం రానున్న కాలంలో భారతదేశ అభివృద్ధికి మరింత తోడ్పాటునందిస్తుందని ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జెల్లా సురేష్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవంపై ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో ఐక్యూ ఏసీ, జేకేసీ, అకాడమిక్ సెల్ సంయుక్త నిర్వహణలో సదస్సును నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సురేష్ మాట్లాడుతూ ప్రపంచానికే భారతీయ విద్యా విధానం తలమానికమైనదని అన్నారు. విద్యార్థి విద్యతో పాటు వృత్తిపరమైన శిక్షణ నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు మరింతగా పెరగడానికి అవకాశం ఉందన్నారు. సభాధ్యక్షుడు, ఇన్‌చార్జి పిన్సిపాల్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధులు కావాలన్నారు. ఈ సందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఎనలేని కృషి చేసిన మౌలానా అబుల్ కలామ్ అజాద్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ వై.స్వర్ణశ్రీ, అకాడమిక్ కోఆర్డినేటర్ జి.శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




- అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రూ.4,500 కోట్లు కేటాయింపు..ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా **రూ.908 కోట్ల** లబ్ధి
- తల్లికి వందనం పథకం నిధుల కేటాయింపునకు ఓకే.. ఒకటి నుంచి ఇంటర్ వరకు జిల్లాలో 16.51 లక్షల మంది తల్లులకు ప్రయోజనం. లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున జిల్లా అంతటికి **రూ.2,476 కోట్ల** వరకు నిధుల అవసరం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సైతం త్వరలో అమలు చేస్తామని ప్రకటన.. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో **19 లక్షల మంది** వరకు ప్రయోజనం

సూపర్.. బడ్జెట్

కూటమి 'పద్దు' పొడుపు







కాకినాడ/రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పయ్యావుల పద్దు సంక్షేమ మంత్రం జపించింది.బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట వేస్తూ ముందుకు కదిలింది. మహిళలు, అన్నదాతల మేలే అసలు సిసలు ప్రాధాన్యంగా భావించి వరాల జల్లు కురిపించింది. ఎప్పుడెప్పుడా అని సూపర్‌సిక్స్ హామీల అమలుకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులకు తీపిక బురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం అలవిమాలిన అప్పులతో ఖజానాను గుల్ల చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించినా.. ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడుతూ ఇచ్చిన హామీల అమలుకు నిధుల విదిలింపుతో తమది చేతల ప్రభుత్వమని విత్తమంత్రి చూపించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళల ఉచితబస్సు ప్రయాణానికి త్వరలో శ్రీకారం చుడుతున్నామని ప్రకటించి పేద, మధ్య తరగతి వర్గాలను ఉత్సాహపరిచారు. వ్యవసాయానికి తూట్లు పొడిచి అన్న దాతల సిరిని అటకెక్కించిన గత వైసీపీ ప్రభుత్వ పాతకానికి చరమగీతం పాడుతూ తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి బడ్జెట్‌లో ఊపిరిపోశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి రాష్ట్రబడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వికసించింది. బడ్జెట్ ప్రకటన మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క అన్నదాత సుఖీభవ పథకం అమలుకే రాష్ట్రప్రభుత్వం 4.54 లక్షల మంది రైతులకు రూ.908 కోట్ల లబ్ధి జరగనుంది.

అన్నదాతలకు ఆనందం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన అన్నదాతలను ఆదుకుంటామని ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.4,500 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. సున్నా వడ్డీ రుణాలకు బడ్జెట్‌లో రూ.628 కోట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 3.01 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇందులో ఒక్క కాకినాడ జిల్లాలో 96,383మంది అన్నదాతలకు మేలు జరగనుంది. వీరంతా రూ.22 కోట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. అన్నదాతలకు అండగా నిలబడేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమలు చేసింది. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా రైతులకు బోర్లు కొట్టించింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి ఊపిరిపోసింది. రూ.50 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. దీంతో తిరిగి అన్నదాతలకు మంచి రోజులు వచ్చినట్లయింది.

తల్లికి వందనమే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల ప్రకటించారు.దీంతో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్నికలకు ముందు టీడీపీ ఈ పథకాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రాధాన్యం కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం.ఇందులో ఒక్క కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం కలగనుంది. ఒక్క కాకినాడ జిల్లాకు చూస్తే ఆర్థిక భారం రూ.930కోట్ల వరకు ఉంది.

ప్రకృతి సాగుకు పండగే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ప్రకృతిసాగు విస్తీర్ణం పెరుగుతోంది.ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.422 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విధానం కింద సాగుచేసే రైతులకు ఆర్థిక సహకారం అందనుంది. ఉమ్మడి జిల్లాలో వరి, ఇతర వాణిజ్య పంటలు దాదాపు పదివేల ఎకరాల్లో ప్రకృతి సాగు కింద ఉన్నాయి. కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీనికి మరింత కట్టుబడి ఉంటామని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రక టించింది. దీంతో స్మార్ట్‌సిటీకి మరింత ఆర్థిక దన్ను లభించనుంది. రూ.50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్ర ణాళికల రూప కల్పన చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మండపేట, రామచంద్రపురం,పిఠాపురం తది తర పట్టణాలకు మహర్దశ పట్ట నుంది.ఈ ప్రణాళికతో పట్టణాల్లో ప్రజల జీవన విధానం, భవిష్యత్తులో పెరగబోయే ట్రాఫిక్‌కు పరిష్కారం, భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికలతో మరింత మెరుగుపడనున్నాయి.

- రాష్ట్ర బడ్జెట్‌లో వరాల జల్లు
- సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి
- సూపర్‌సిక్స్ హామీలకు పెద్దపీట
- మళ్లీ ఎన్టీఆర్ జలసిరి
- నగరాల అభివృద్ధికి చర్యలు
- 'తూర్పులో ప్రత్యేక బెటాలియన్
- చింతలపూడికి ప్రాధాన్యం
- రహదారులు మార్చికి రెడీ

ఇక రైట్‌రైట్..

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్ది పాటి దూరానికే షాక్ కొట్టే ఛార్జీలు వసూలు చేసింది.బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ నేపథ్యంలో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా మంత్రి పయ్యావుల ప్రకటించారు.ఈ పథకంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25.52 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కిందకు రానున్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలో 9.50లక్షల మం దికి ప్రయోజనం జరగనుంది.

రహదారుల నిర్మాణం

రాజమహేంద్రవరంలో మరో ప్రత్యేక పోలీసు బెటాలియన్‌ను ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పరిధిలోని గోదావరిలో నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత కల్పించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలకు ఇళ్ల నిర్మాణానికి ప్రధాని ఆవాజ్ యోజన పథకం కింద రూ.లక్షా 30 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.50వేలు ఇవ్వనుంది. దీంతో పేద, మధ్య తరగతి బీసీలకే సొంతిల్లు కట్టుకోవడానికి వెసులుబాటు దొరికినట్టు అయింది. మిగతా జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా తక్కువగా ఉంది.జిల్లాలో రహదారి పనులన్నీ 2025 మార్చినాటికి పూర్తి చేయనుంది.బీసీ సబ్ ప్లాన్‌కు ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయనుంది. బీసీల స్వయం ఉపాధికి ప్రత్యేక పథకాలు తీసు కుని రానున్నట్టు ప్రకటించారు.అభివృద్ధిపరంగా రోడ్లు, డ్రెయిన్లు,భవనాలు నిర్మించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన రోడ్లన్నీ వచ్చే మార్చిలోపు నిర్మించడానికి నిధులు కేటాయించారు. జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలన్నింటికీ డబుల్ లేన్ రోడ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గోదావరి జిల్లాలకు అన్నం పెట్టే ఇరిగేషన్ సిస్టమ్ అభివృద్ధికి భారీగానే నిధులు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. తాము డెల్టా కాలువల అభివృద్ధితో పాటు గోదావరి ఏటిగట్లు, పొలాలు కోతలకు గురికాకుండా గ్రోయిన్ల నిర్మాణ ప్రతిపాదనలు పంపామని,ఈసారి భారీగా నిధులు కేటాయించనున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో వివరంగా కేటాయింపులొస్తాయన్నారు.

ఇది అభివృద్ధికి తొలిమెట్టు



ఇది నాలుగు నెలల బడ్జెట్. గత ఐదేళ్లలో గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించే బడ్జెట్ ఇది. రాబోయే ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమాలకు ఇది తొలి మెట్టు. ఏపీ సమగ్రా భివృద్ధికి తొలి అడుగు. టూరిజం, స్పోర్ట్స్, యూత్ కోసం రూ.328 కోట్లు కేటాయిం చాం.

\- కందుల దుర్గేష్, మంత్రి

అభివృద్ధి- సంక్షేమంపై దృష్టి



ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి ఇది అద్భుత బడ్జెట్. అభివృద్ధి- సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయం.. ఇరిగేషన్.. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించింది. సూపర్‌సిక్స్ అమలు వేగవంతం చేసింది.

\- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

అద్భుత బడ్జెట్ ఇది..



తీవ్ర కష్టాలో ఉన్న రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిని పరుగెత్తించే విధంగా బడ్జెట్ ఉంది. ఇది కేవలం భవిష్యత్ దృష్టి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యం. మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

\- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది



ఈ బడ్జెట్ ప్రజల్లో నమ్మకాన్ని కలిగించింది. వైసీపీ అనాలోచిత విధానాల వల్ల అప్పుల పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బడ్జెట్ ఇది. సంక్షేమం- అభివృద్ధి రెండిండికి ప్రాధాన్యత ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధులతోపాటు అన్నివర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించింది.

\- ఆదిరెడ్డి శ్రీనివాసు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే

రైతు సంక్షేమానికి పెద్దపీట



ఈ బడ్జెట్ ఎక్స్‌లెంట్. రైతు సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి అన్ని విధాలా ఉపయోగపడేది. శిథిలావస్థలో ఉన్న ఎడ్యుకేషన్, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు తేనుంది. అభివృద్ధితోపాటు సంక్షేమం కచ్చితంగా అమలుచేసే బడ్జెట్ ఇది. పేదల సంక్షేమం బడ్జెట్ ఇది.

\- బత్తుల బలరామకృష్ణ రాజానగరం ఎమ్మెల్యే

అసమానతలు తగ్గించే బడ్జెట్



ఈ బడ్జెట్ సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించే విధంగా ఉంది. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోయిన సంగతి తెలిసిందే. ఇది అభివృద్ధి- సంక్షేమంతో కూడి ఉంది. రైతులు, కూలీలు, మహిళలు, వివిధ వర్గాల ఎదుగుదలకు ప్రాధాన్యం కలిగించింది.

\-మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

ఇది సూపర్ బడ్జెట్



కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఎలా నడిపించాలో సీఎం చంద్రబాబుకు తెలుసు.. అందుకే మార్చి వరకు ఓ పునాదిగా సంక్షేమ అభివృద్ధితో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇది సూపర్ బడ్జెట్.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

\-ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే



పీజీఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

24 గంటల్లో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం/రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను 24 గంటల్లో పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీకోసం (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు 144 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూవిభాగానికి 59, పంచాయితీరాజ్ 22, వ్యవసాయ శాఖ 18, పోలీస్ 18, ఇతర శాఖలకు 27 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఎస్పీ నరసింహ కిషోర్ 26 ఫిర్యాదులను స్వీకరించారు.చట్ట పరిధిలో తగు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు పాల్గొన్నారు.



హర హర మహాదేవ

గోదావరి ఘాట్లకు భక్తులు పోటెత్తారు.. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా తెల్లవారుజామునుంచే భక్తజనం పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా తరలివచ్చారు.. గోదావరిలో స్నానం చేసి హర హర మహాదేవ శంభో శంకర అంటూ దీపాలు వదిలారు.. దీంతో రాజమహేంద్రవరం, కొవ్వూరులోని గోదావరి రేవులు భక్తజనంతో నిండిపోయాయి.. శివాలయాలకు క్యూకట్టారు.. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.. ఎక్కడి కక్కడ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 20 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ శాసన మండలి ఉప ఎన్నికల షెడ్యూలు సోమవారం విడుదలైందని, ఈ నెల 18వ తేదీలోపుగా నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. తూర్పు గోదావరిలోని 18 మండలాల్లో ఒక్కోటి చొప్పున, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు మొత్తం 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.పురుషులు 1597, మహిళలు 1307 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమలో ఈ నెల 4 నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని గుర్తు చేశారు. నియమావళి పర్యవేక్షణకు 21 బృందాలను నియమించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

ముఖ్య తేదీలు ఇవే : నోటిఫికేషన్ జారీ నవంబరు 11, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ 18, పరిశీలన 19, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 21, పోలింగ్ డిసెంబరు 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ, 9న ఓట్ల లెక్కింపు,12న ఎన్నికల కోడ్ ముగింపు.

14 నుంచి ఇంటింటా కేన్సర్ స్క్రీనింగ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 14 నుంచి ఇంటి వద్దనే ఉచితంగా కేన్సర్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు షుగర్, బీపీ, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌కు సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో టి.శ్రీరామచంద్రమూర్తి,డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర, ఎపిడమాలజిస్ట్ సుధీర్, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ హెల్త్‌కార్డులు

చైల్డ్ స్క్రీనింగ్‌కు సంబంధించి హెల్త్‌కార్డును కలెక్టర్ ప్రారంభించారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ హెల్త్‌కార్డులను అందజేయడం జరుగుతుందన్నార.వైద్య సిబ్బంది ద్వారా ఆ కార్డులో సంబంధిత పిల్లవాడికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారాన్ని నింపడం జరుగుతుందని తెలిపారు. నవంబరు 12 నుంచి 28వ తేదీ వరకూ సాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

తప్పుల తడకగా భూముల రీసర్వే

» పాత పద్ధతిలోనే పునరుద్ధరించాలి : రైతులు » కురుకూరులో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో ప్రశ్నిస్తున్న రైతులు

దేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వే అంతా తప్పుల తడకగా ఉందని, పాత పద్ధతిలోనే భూములు పునరుద్ధరించాలని, లేకపోతే మొత్తం భూములన్నీ సక్రమంగా ఆన్‌లైన్ చేయాలని రైతులు రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని కురుకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులు గత ప్రభుత్వ పాలనలో జరిగిన రీసర్వే సమయంలో అవకతవకలు జరిగాయని, 80శాతం రైతుల భూములు సక్రమంగా జరగలేదని 10ఎకరాలు ఉన్న రైతులకు 3ఎకరాలే ఉన్నట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. కాగా మొత్తం కురుకూరులో 1557 పట్టాలుండగా 65 మంది రైతుల పొలాల్లో 10రోజుల నుంచి రీసర్వే చేస్తున్నట్టు తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. రైతుల పొలాలను పూర్తిస్థాయిలో సర్వే చేయడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ సర్వేయర్ వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ పి.కిల్లేశ్వరరావు, రైతులు వై.భాస్కరరావు, కె.అచ్యుతరాయుడు, కలగర శ్రీనివాస్, కలగర జనార్దనరరావు, నల్లుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌ను ఢీకొన్న లారీ

» ఆయిల్‌ట్యాంకర్‌ను ఢీకొన్న సెప్టిక్ ట్యాంక్.. ట్యాంకర్ బోల్తా

» లారీ డ్రైవర్ మృతి.. మృతుడు భద్రాచలం వాసి



మృతుడు రాజు



నుజ్జునుజ్జయిన లారీ

దేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి లారీ ఒకదానికి ఒకటి ఢీకొనడంతో డ్రైవర్‌మృతి చెందిన సంఘటన దుద్దుకూరు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. భద్రాచలం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం వెళ్తున్న ధాన్యం లారీ దుద్దుకూరు సమీపంలో ఎదురుగా వెళ్తున్న సెప్టిక్ ట్యాంకును బలంగా ఢీకొనడంతో సెప్టిక్ ట్యాంకు ముందు.. వెళ్తున్న ఖాళీ ఆయిల్‌ట్యాంకును ఢీకొనడంతో ఖాళీ ఆయిల్‌ట్యాంకర్ తిరగబడింది. ఈ ఘటనలో ధాన్యం లోడు లారీ డ్రైవర్ రాజు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఖమ్మం జిల్లా భద్రాచలం గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శంకర..హర హర

» కార్తీక సోమవారం పుణ్యస్నానాలు

» కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పూజలు

» భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం



నదిలో కార్తీక దీపం వదులుతున్న భక్తురాలు

కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం గోదావరి తీరంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకుని వేకువజాము నుంచి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాల్లోని శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు అధిక సంఖ్యలో కార్తీకదీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పండితులకు సాలగ్రామ, దీప దానాలను చేశారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు, కొవ్వూరు పట్టణ, మండలంలోని గ్రామాల్లో శైవ క్షేత్రాలన్నీ భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. క్షేత్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సోమేశ్వరుడికి పూజలు

నిడదవోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో ప్రధానార్చకుడు శ్రీకాకోళపు లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహిం చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

రుద్రాభిషేకం

నల్లజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పోతవరం-కవులూరు గ్రామాల మధ్య ఉన్న ఉమారామాలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. బుధవారం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 25వ తేదీ వరకు ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొంది.



నిడదవోలు సోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉషోదయాన..

కార్తీకమాసం సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజనంతో నిండుగా ఉంది.. ప్రత్యక్ష దేవుడు సూర్యభగవానుడు.. సోమవారం వేకువజామున మెల్లమెల్లగా బయటకు వస్తూ.. గోదారమ్మలో కాసేపు తన వెలుగును ఇలా ప్రసరింపజేసి భక్తులకు కనువిందు చేశాడు.. ఈ సుందరదృశ్యం చూపరులను ఆకట్టుకుంది.. - కొవ్వూరు



చట్టాలపై అవగాహన ఉండాలి

» రాజమహేంద్రవరం సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్

» అత్యాచార నిరోధక చట్టంపై ఒక్కరోజు అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ పర్హీన్

కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన ఉండాలని రాజమహేంద్రవరం సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్ అన్నారు. కొవ్వూరు సుందర సాయి కల్యాణ మండపంలో రాజమహేంద్రవరం ప్రాంతీయ సీఐడీ కార్యాలయ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు అత్యాచార నిరోధక చట్టంపై విద్యార్థులకు ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న నేరాలు, చట్టరీత్యా వారికి లభిస్తున్న రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడానికి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో అరెస్టులు జరిగినప్పటికీ ట్రయల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పక పోవడంతో శిక్షలు పడడం లేదన్నారు. బాధితులు తప్పనిసరిగా కోర్టులకు వచ్చి సాక్ష్యం చెప్పాలన్నారు. రిటైర్డ్ సీనియర్ పీపీ గోపాలరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ చట్టం, ప్రభుత్వం సమాజంలో అంటరానితనం నిర్మూలనపై తీసుకువచ్చిన ప్రొటక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్, అట్రాసిటీ చట్టం, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టం ఇంప్లిమెంటేషన్, స్పెషల్ కోర్టు, బాధితులు కులధ్రువీకరణ పత్రం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ కె.సాల్మన్‌రాజు రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి కె.భీష్మ గాంగేయుడు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.సందీప్, సీనియర్ పీపీ కె.గోపాలరావు, ఎంపీడీవో కె.సుశీల, సీఐ పి.విశ్వం, రిటైర్డ్ హాస్టల్ అధికారి పి.జయరాజు, మాల మహాసభ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్, సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరిచర్లగూడెంలో భూకబ్జా

» ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

» ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టీడీపీ నాయకుల ఫిర్యాదు



గోపాలపురం తహశీల్దార్ విద్యాపతికి ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గోపాలపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెంలోని పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకు కొనుగోలు చేసిన 15 ఎకరాల్లో 70 సెంట్ల భూమిని ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మగ్బుల్ బాష, వేముల నాగరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. 1984లో సీఎం ఎన్టీ రామారావు పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీకి 166సర్వే నెం బర్ 15ఎకరాలు ఒక రైతు వద్ద కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేశారని, వైసీపీ అధికా రంలోకి వచ్చేనాటికి 2ఎకరాలు భూమి మిగిలినట్టు పేర్కొన్నారు. ఆ భూమిలో 70సెంట్లలో సచివాలయం, రైతుభరోసా కేంద్రానికి కేటా యించి మరో 70సెంట్ల భూమిని సెం టున్నర చొప్పున లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైసీపీకి చెందిన వ్యక్తి ఆర్డీవో పేరున ఉన్న 70సెంట్ల భూమికి నకిలీ పట్టాలు సృష్టించి ఆన్‌లైన్ చేయించుకు న్నారు. అయితే ఆన్‌లైన్ చేసే క్రమంలో 70సెంట్ల భూమి ఆ ప్రదేశంలో లేకపోవడంతో 52సెంట్ల భూమిని నమోదు చేయించారని పేర్కొన్నారు. ఆర్డీవో పేరున ఉన్న భూమిని ప్రైవేటు వ్యక్తి ఏ ప్రతిపాదికన ఆన్‌లైన్ చేశారో ప్రజలకు తెలియజేయాలని కోరారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టి భూమిని ఆన్‌లైన్ చేయించుకున్న వ్యక్తితో పాటు అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డివిజన్ స్థాయిలో 8 ఫిర్యాదులు : ఆర్డీవో

కొవ్వూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 8 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చిన్ని చిన్న సమస్యలను మండల పరిధిలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో జీఎస్ఎస్ జవమార్ బాజీ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రావీణ్యత సాధించాలి

కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు అన్నారు. సోమవారం కొవ్వూరు హోలీ ఏంజిల్స్ విద్యార్థులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఏంజిల్స్ ఆర్ట్ అండ్ స్పోర్ట్స్ వీక్‌లో భాగంగా క్రీడాజ్యోతితో పట్టణంలో దీపశిఖ ర్యాలీ జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్విసభ్య కమిటీ సభ్యులు రామకృష్ణారావు క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తిరిగి పాఠశాలకు ర్యాలీ చేరుకుంది. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14న బహుమతులు అందజేస్తామని పాఠశాల కరస్పాండెంటు వలియవీడు నెల్సన్ అంటోని తెలిపారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ ఉమా మహేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరిని సన్మానిస్తున్న టీడీపీ దేవరపల్లి నాయకులు

రుడా చైర్మన్‌కు నాయకుల సన్మానం

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి టీడీపీ దేవరపల్లి మండల అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, టీడీపీ నాయకులు ఉప్పులూరి రాంబాబు, యలమాటి వెంకట్రాజు, పిన్నమని నవీన్, వీరుగంటి జగదీష్‌రాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరం పార్టీ కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

యజ్ఞవల్క జయంతి పూజలు

నిడదవోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన కాశీరేవులోనున్న సూర్యయజ్ఞ వల్క ఆంజనేయ మందిరంలో సోమవారం కార్తీక శుద్ధ దశమి పురస్కరించుకుని యజ్ఞవల్క జయంతిని జరిపారు. ఉదయం నుంచి గురుపూజ, సూర్య నమస్కారాలు, రుద్రాభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అన ంతరం పలువురు వేద పండితులకు పండిత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్య క్షుడు పొన్నా కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞవల్క జయంతిని జరుపుతున్న దృశ్యం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకు ఇల్లు

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ఆస్తినష్టం సుమారు రూ.6 లక్షలు

ఉండ్రాజవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్ధరి గ్రామంలో సోమవారం తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో నాలుగు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో మంచాలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. అధికారులు, నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. తణుకు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ పీఎస్ఆర్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకున్న శేషారావు

ఉండ్రాజవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలివెన్ను గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి 16వ వార్షికోత్సవం మహోత్సవాలు సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. అనంతరం కార్తీక అన్నసమారాధన జరిపారు. స్థానిక భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సప్తాహ మహోత్సవాలు



కొవ్వూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలోనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 58వ వార్షిక సప్తాహ మహోత్సవాలు ప్రారంభించారు. సోమవారం వెంకటేశ్వరస్వామికి యనమదల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు జరిపారు. సహస్రనామార్చన, కుంకుమ పూజలు చేశారు. రాత్రి 7.30 కు స్వామి వారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో గుత్తా వెంకటకృష్ణ, చావా వెంకటరావు, యనమదల రామారావు, పోతుల ఏకోనారాయణ, చావా రంగారావు, యనమదల సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.